



పత్రపల్లె వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన టమోటా తోట

భయం నీడలో అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు

సోమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని ఆవులపల్లె, చిన్నఉప్పరపల్లె, పేటూరు, అన్నెమ్మగారిపల్లె, పెద్దఉప్పరపల్లె పంచాయతీల్లో గజ దాడులు దాదాపు పదేళ్లుగా సాగుతున్నాయి. టమోటా, వరి, మామిడి, బొప్పాయి తోటలపై దాడులు చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గార్గేయ నదీ తీరం సమీపంలోని అటవీ ప్రాంతం ఏనుగుల సంచారానికి అనువుగా ఉంది. పేటూరు సమీపంలోని కనికలచెరువు, పత్రపల్లె సమీపంలోని కోనమూల, ఇర్లపల్లె సమీపంలోని కొండ కనుమ అనువుగా ఉండడంతో అక్కడే మకాం వేస్తున్నాయి.రెండేళ్లుగా ఇక్కడి నుంచి సదుం, పులిచెర్ల మండలాల వైపు దారి మళ్లాయి. అక్కడ కొద్ది రోజులు సంచరించి మళ్లీ సోమల మండలం వైపు వస్తున్నాయి.పగలు అడవుల్లో ఉండి రాత్రి వేళల్లో అటవీ శివారు గ్రామాల్లో పంటపొలాల్లోని పంటలను, డ్రిప్ పైపులను ధ్వంసం చేస్తూ రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి.ఎకరా వరిసాగుకు రూ. 30 వేలు ఖర్చవుతుండగా పరిహారం కింద రూ. 7 వేలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోందని, మామిడి, కొబ్బరి చెట్లకు రూ. 300 చొప్పున ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు.

పరిహారం పెంచాలి



మామిడి పంట కోతల సమయంలోనే ఏనుగులు దాడులు చేస్తున్నాయి. డ్రిప్ పైపులు ధ్వంసం చేస్తున్నాయి. కష్టపడి సాగు చేసిన వరి, టమోటా తోటలను తీవ్రంగా నష్ట పరుస్తున్నాయి.నష్టపోయిన పంటలకు అందిస్తున్న పరిహారం ఏమాత్రం చాలడం లేదు. రైతుల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం పరిహారం పెంచాలి.

- కపిల సుబ్రహ్మణ్యం, సోమల

నష్టం అపారం

తీవ్ర ఆందోళనలో రైతాంగం

కల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో మూడేళ్లుగా పంటలపై గజరాజులు వరుస దాడులు చేస్తుండడంతో రైతన్నలు విలవిల్లాడుతున్నారు. పంటల పెట్టుబడికి అప్పులు చేసి ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే వేళ


సేద్యంపై ఆశలు వదిలేస్తున్నారు

ఏనుగుల గుంపు నాశనం చేస్తుండడంతో వ్యవసాయంపైనే ఆశలు వదులుకుంటున్నారు. నష్టపోయిన పంటలకు తూతూమంత్రంగా అటవీశాఖ నష్ట పరిహారం చెల్లిస్తుండడంతో మరింత ఆందోళన చెందుతున్నారు.పులిచెర్ల మండలంలోని తూర్పు, పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం సరిహద్దులో ఉన్న పంచాయతీల్లో గజదాడులతో పంటలకు అపారనష్టం వాటిల్లుతోంది.వరి, కొబ్బరి, మామిడి, టమోటా, అరటి, వంకాయ, వేరుశనగ పంటలు ధ్వంసం కాగా..మామిడి తోటలకు అమర్చిన రాతికూసాలు, డ్రిప్ పైపులను విరిచేయడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. మూడేళ్ల కాలంలో ఏనుగుల గుంపు దాడుల్లో ఇప్పటి వరకు వరి పంట 200 హెక్టార్లు, టమోటా 100 హెక్టార్లు, మామిడి 200 హెక్టార్లు, 500 కొబ్బరిచెట్లు, 10 హెక్టార్లు కూరగాయల పంటలు, వందల సంఖ్యలో రాతికూసాలు ధ్వంసమయ్యాయి. ఇక మామిడి సీజన్‌లో వందల టన్నుల కాయలు నేలరాలిపోవడంతో రైతులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.



గజదాడిలో ధ్వంసమైన కొబ్బరి చెట్టు

పరిహారం కోసం ఎదురుచూపులు



ఏనుగుల గుంపు దాడిలో నష్టమైన టమోటా పంటకు పరిహారం కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్నాం. ధ్వంసమైన టమోటా పంటను స్వయంగా అటవీశాఖ అధికారులు పరిశీలించారు. అయితే పరిహారం అందించడంలో చొరవ చూపడం లేదు.

- హరినాథ్, కోటపల్లె, పులిచెర్ల మండలం

28 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 28 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా జీడీ నెల్లూరులో 86.8 మిమీలు అత్యల్పంగా శాంతిపురంలో 2.0 మిమీల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. వెదురుకుప్పంలో 11.4, నింద్రలో 5.2, విజయపురంలో 2.2, కార్వేటినగరంలో 10.6, పెనుమూరులో 22.4, పూతలపట్టులో 45.2, ఐరాలలో 28.8, సోమలలో 34.6, చౌడేపల్లెలో 8.2, పుంగనూరులో 10.2, పెద్దపంజాణిలో 32.6, గంగవరంలో 41.2, తవణంపల్లెలో 20.8, ఎస్ఆర్‌పురంలో 14.6, చిత్తూరు రూరల్‌లో 27, పలమనేరులో 35.8, బైరెడ్డిపల్లెలో 10.2, వీకోటలో 22. గుడుపల్లెలో 3.8, కుప్పంలో 10, రామకుప్పంలో 5, బంగారుపాళ్యంలో 15, యాదమరిలో 42.4, గుడిపాలలో 23, పాలసముద్రంలో 9,8, చిత్తూరు అర్బన్‌లో 58.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.77 కోట్లు



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ.1,77,02,032 ఆదాయం లభించింది. శుక్రవారం ఆలయ ఆస్థాన మండపంలో ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షణలో స్వామి కానుకలను లెక్కించారు. ఈ ఆదాయంలో 139 యూఎస్ఏ, 110 కెనడా, 110 ఆస్ట్రేలియా, 2 సింగపూర్ డాలర్లు, 25 యూఏఈ దిర్హామ్స్, 10 యూరోలు, 11 మలేసియా రింగిట్స్‌తో పాటు 52 గ్రాముల బంగారు, 510 గ్రాముల వెండి లభించినట్లు ఈవో తెలిపారు. అలాగే గో సంరక్షణ హుండీ ద్వారా రూ.16,845, అన్నదాన కేంద్రం వద్ద ఉన్న హుండీ ద్వారా రూ.20,699 సమకూరినట్లు ఈవో తెలిపారు. ఈ ఆదాయం 28 రోజులలో సమకూరినట్లు ఈవో తెలిపారు. డీఈవో సాగర్‌బాబు, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, ప్రసాద్, ధనపాల్, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, సూపరింటెండెంట్ కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, హుండీ ఇన్‌స్పెక్టర్ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీల్లో శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు

ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షలు ● జడ్పీ నిధుల నుంచి రూ. 20 లక్షలు ● డీవీఎంసీ సమావేశంలో ఎంపీ వెల్లడి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దళితవాడల శ్మశాన వాటికల అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.10 లక్షలు, జడ్పీ నిధుల నుంచి రూ.20 లక్షలను విడుదల చేస్తామని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా స్థాయి డీవీఎంసీ సమావేశం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. డీ వీఎంసీ సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. బ్యాంకు లింకేజీ రుణాలను ఇవ్వా లని, నీటి సమస్యను పరిష్కరించాలని, దళిత, గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. గాంధీ విగ్రహం పక్కనే అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ పీసీఆర్ కళాశాలలో అంబేడ్కర్ పేరుతో లైబ్రరీ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ డీవీఎంసీ సభ్యులందరూ విధిగా ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను సందర్శించి అక్కడి సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సబ్సిడీ రుణాలను పెద్దమొత్తంలో ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. కాణిపాకంలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలపై చిత్తూరు ఆర్డీవోను విచారణాధికారిగా నియమిస్తున్నామన్నారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు నమోదైన 28 కేసులలో విచారణ చేసి 42 మంది బాధితులకు రూ. 37.50 లక్షలను నష్టపరిహారం కింద అందజేశామన్నారు. ఈ సమావేశంలో పలమనేరు ఆర్డీవో భవాని, నగరి ఆర్డీవో అనుపమ, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీలు,సాంఘిక సంక్షేమాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, డీవీఎంసీ సభ్యులు మునీంద్రనాయక్, రాజ్‌కుమార్, వరలక్ష్మీ, రమణ, శేషాద్రి, శంకర్, మునస్వామి, దామోదరం, రఘురామ్, రవి, కుమార్, సారథి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

మీకవసరమైన సౌకర్యాలన్నీ కల్పిస్తాం

- అంబత్తూరు పారిశ్రామికవేత్తలతో కలెక్టర్, ఎమ్మెల్యే
- కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుపై సమీక్ష

విజయపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విజయపురం మండలాన్ని పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని కలెక్టరు సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుపై అంబత్తూరు ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రతినిధులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోసలనగరం పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ఎ- బ్లాక్‌లో 1500 ఎకరాల భూమిని గుర్తించామన్నారు. పారిశ్రామిక వాడకు అవసరమైన నీటి సదుపాయం, రోడ్డు, కరెంటు వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా నీరు నిరంతరాయంగా సరఫరా చేస్తామన్నారు. పరిశ్రమలకు అవసరమైన భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి స్టాంప్ డ్యూటీని ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. పారిశ్రామిక హబ్‌తో నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సమస్యలపై పిర్యాదులను స్వీకరించారు. అంబత్తూరు ఇండస్ట్రియల్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రతినిధి, సప్తగిరి హైమా ఇండస్ట్రియల్ పార్కు అధ్యక్షుడు హరిప్రసాద్, ఉపాధ్యక్షుడు ఆర్వేల రమేష్ నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే భానుప్రకాష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో తామంతా పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చామన్నారు. ఎకరా భూమి ధర రూ.20 లక్షల లోపు అందిస్తామని కలెక్టరు హామీ ఇవ్వడంతో రెండు నెలల్లో ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు.ఆర్డీవో అనుపమ, అర్అండ్‌బీ డీఈ సుజాత, తహసీల్దార్ కిరణ్, ఏపీఐఐసీ అధికారులు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కా ధనంజయ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రమణ్యం రాజు, లోకేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



కోసలనగరంలో పారిశ్రామిక వాడపై సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాను

తిరుపతి కలెక్టరేట్‌కు మళ్లీ బాంబు బెదిరింపు


తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):తిరుపతి కలెక్టరేట్‌కు మరోసారి ఫేక్ బాంబు బెదిరింపు వచ్చింది. 'కలెక్టర్ అన్నయ్యా.. మేము మద్రాస్ టైగర్స్. జైలులో ఉన్న టీఎన్ఎల్ఏ నాయకుడు ఎస్.మారన్ సైబర్ గొరిల్లాల విభాగం. పాకిస్తాన్, ఐఎస్ఐ తదితరుల సాయంతో పేలుళ్లకు పాల్పడుతున్నాం. కలెక్టర్ కార్యాలయంలో ఐదు శక్తిమంతమైన బాంబులు అమర్చబడ్డాయి. అవి మధ్యాహ్నం పేలుతాయి' అంటూ తమిళనాడు నుంచి తిరుపతి ఆర్డీవో, కలెక్టర్ అధికారిక మెయిళ్లకు శుక్రవారం వేకువజామున 3.38 గంటలకు మెయిల్ వచ్చింది.పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాంబు.. డాగ్ స్క్వాడ్లు కలెక్టరేట్‌కు చేరుకుని తనిఖీలు చేపట్టాయి. అది ఫేక్ మెసేజ్ అని నిర్ధారించాయి.

దొరకని యూనిస్ ఆచూకి

పలమనేరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు సమీపంలోని కళ్యాణరేవులు జలపాతంలో గురువారం గల్లంతైన యూనిస్ ఆచూకీ కోసం శుక్రవారం సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టారు. యూనిస్ తన స్నేహితులతో కలిసి కళ్యాణరేవులు జలపాతం నీటిలోకి దూకుతున్న వీడియోలు బయటకు రావడంతో ప్రమాదవశాత్తు జలపాతంలోకి పడి గల్లంతు కాలేదని, కేవలం యూనిస్ ప్రమాదకరంగా ప్రవహిస్తున్న జలపాతం నీటిలో దూకడంతోనే గల్లంతైనట్లు నిర్ధారణ అయ్యింది. జలపాతం వద్ద అతడి స్నేహితులు సైతం ప్రమాదకర ప్రదేశాల్లో జలపాతానికి అతిచేరువలో ఉన్న దృశ్యాలు సైతం వీడియోలో కనిపించింది. యూనిస్ మృతదేహం కనిపించక పోవడంతో శుక్రవారం అటవీశాఖకు చెందిన ఎలిఫెంట్ ట్రాకర్స్, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు, యూనిస్ బంధువులు, స్నేహితులు సాయంత్రం వరకు నదీపరివాహక ప్రాంతం పొడవునా గాలించినా యూనిస్ మృతదేహం కనిపించలేదు. నదీజలాలు కళ్యాణరేవులు జలపాతం నుంచి దాదాపు 5 కిలోమీటర్లు అటవీ ప్రాంతంలో ప్రవహిస్తూ తమిళనాడులోని మోర్ధాన ప్రాజెక్టుకు చేరుకొంటుంది. దీంతో యూనిస్ మృతదేహం మోర్ధాన ప్రాజెక్టుకు చేరి ఉంటుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా వుండగా అటవీశాఖ అధికారులు జలపాతం వద్దకు ఎవరూ వెళ్లకుండా కట్టడి చేసేందుకు శుక్రవారం నుంచి అటవీ సిబ్బందిని నియమించారు.



యూనిస్ (ఫైల్ ఫొటో)



జలపాతంలోకి దూకుతున్న యూనిస్



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు సోమల విద్యార్థి ఎంపిక


విద్యార్థితో ప్రధానోపాధ్యాయులు, పీడీ

సోమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు సోమల విద్యార్థి మహమ్మద్ ముబారక్ ఎంపికైనట్లు హెచ్ఎం. హేమసుధాకర్ తెలిపారు. 16న పలమనేరు ఉన్నత పాఠశాలలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో వాలీ బాల్ పోటీల్లో సోమల హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెలలో పలమనేరు ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ కరుణానిధి తెలిపారు.

టీడీపీలో కష్టపడే వారికే గుర్తింపు



రొంపిచెర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి సముచిత న్యాయం, గుర్తింపు ఉంటుందని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పుంగనూరు, పులిచెర్ల, రొంపిచెర్ల మండలానికి చెందిన కార్యకర్తలు చల్లా రామచంద్రారెడ్డిని రొంపిచెర్లలోని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుంగనూరు సుగాలిమిట్టలో రామాలయం నిర్మాణ పనులకు టీటీడీ అనుమతులు కావాలని కోరారు. రొంపిచెర్ల ఆర్ బెస్తపల్లిలో వీధి దీపాలు వెలగడం లేదని, అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని, రాత్రుల్లో విధులకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు చల్లా బాబు దృష్టికి తీసుకొచ్చారు. అలాగే అభివృద్ధి పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్, కృష్ణానాయక్, వెంకట్రమణ, జగదీష్, ప్రకాష్, హరిబాబు ఇమ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.





జీఎస్టీ సంస్కరణలతో లాభదాయకం


పలమనేరులో ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

పలమనేరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణతో ప్రజలకు నేరుగా లాభం జరుగుతోందని.. పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశులు అన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులచే తగ్గిన జీ ఎస్టీపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.నందీశ్వరయ్య, బెనర్జీ, ఈ.వాసు, సుబ్బయ్య, రవీంద్రనాథరెడ్డి, వెంకటేసు బాబు, జయశంకర్, రాజేష్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయానికి కుర్చీల వితరణ


తహసీల్దారు కౌలేష్‌కు కుర్చీలను అందజేస్తున్న నాగరాజు

రామకుప్పం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం వీరనాగపురానికి చెందిన టీడీపీ నేత నాగరాజు తహసీల్దారు కార్యాలయానికి కుర్చీలను వితరణగా ఇచ్చారు. శుక్రవారం టీడీపీ నేతల సమక్షంలో వాటిని ఆయన తహసీల్దారుకు అందజేశారు. కార్యక్రమంలో బీసీసెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, తెలుగుయువత మండల ప్రధానకార్యదర్శి వెంకటాచలం, బీసీసెల్ నేత మణీంద్రం నాగరాజు పాల్గొన్నారు.

గార్గేయ నదిపై
వంతెనల నిర్మాణం కలేనా..!

- పేటూరు మార్గంలో కొట్టుకుపోయిన కల్వర్టులు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు
- వర్షాకాలమొస్తే ప్రయాణానికి తప్పని తిప్పలు


రెడ్డివారిపల్లె మార్గంలో గార్గేయనదిలో ప్రయాణిస్తున్న ప్రజలు


బసవపల్లె మార్గంలో కొట్టుకుపోయిన కల్వర్టు

సోమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల గడుస్తున్నా గార్గేయ నదిపై వంతెనల నిర్మాణం నోచుకోకపోవడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. నిధులు మంజూరు కాకపోవడంతో వర్షాకాలం వస్తే ప్రయాణాలు గగనంగా మారుతున్నాయి. పెద్దఉప్పరపల్లె వద్ద గార్గేయనది ప్రవహించడంతో అటు వైపున ఉన్న రెడ్డివారిపల్లె, బోనమంద, దుర్గంకొండ ఆలయానికి, పేటూరు, బసవపల్లె, చిన్నకమ్మపల్లె, చిన్నతోపు, పొలికిమాకులపల్లె, ఎర్రగుంతలపల్లె తదితర గ్రామాల ప్రజలు పెద్దఉప్పరపల్లెకు వచ్చి నిత్యావసర వస్తువులు తెచ్చుకోలేక పోతున్నారు. వైద్యసేవలు పొందలేకపోతున్నారు. వర్షాకాలం గార్గేయనది ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈక్రమంలోనే గత ఏడాది పేటూరు మార్గంలో ఉన్న కల్వర్టు వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో టీడీపీ నాయకులు చొరవ తీసుకుని తాత్కాలికంగా కల్వర్టు ఏర్పాటు చేశారు. నిర్మించిన మూడో రోజునే భారీ వర్షాలతో ఆ కల్వర్టు కొట్టుకుపోయి 7 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అనంతరం మళ్లీ తాత్కాలిక కల్వర్టు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భారీ వర్షాలు కురవడంతో వారం క్రితం మూడోసారి కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గార్గేయ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రజలు వరదనీటిలో ప్రయాణం చేయక తప్పడం లేదు. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు సమస్యను మొరపెట్టుకున్నా స్పందన కరవైంది. కూటమి పాలనలోనైనా వంతెనలు నిర్మించి ప్రజలు కష్టాలు తీర్చాలని కోరుతున్నారు. పెద్దఉప్పరపల్లె వాసులు నదీతీరం దాటి పొలాల వైపు వెళ్లలేకపోతున్నారు. నదీతీరంలో సాగు చేసిన పంటలను స్వగ్రామాలకు తీసుకురాక ఇబ్బందులు పడుతున్నారు. పాడిపరిశ్రమపై ఆధారపడిన రైతులు పాల ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించలేకపోతున్నారు. పాలడెయిరీలకు ఉత్పత్తులను చేర్చలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు బడులకు, కళాశాలలకు వెళ్లలేక ఇళ్లల్లోనే ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వంతెనలు నిర్మించాలి



గార్గేయనదిపై ఉన్న తాత్కాలిక కల్వర్టు మూడు సార్లు కొట్టుకుపోయింది. పెద్దఉప్పరపల్లె నుంచి చిన్నకమ్మపల్లె, దుర్గంకొండ, బోనమందకు వెళ్లలేకపోతున్నాం. అధికారులు స్పందించి గార్గేయనదిపై శాశ్వత వంతెన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- పెద్దరెడ్డెప్ప నాయుడు, పెద్దఉప్పరపల్లె

వెళ్లడానికీ కష్టమే



వర్షాకాలం వస్తే గార్గేయనది ఉధృతంగా ప్రవహిస్తోంది ప్రజలు ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సిందే. రైతులు తమ పంటలను మార్కెట్‌కు తరలించలేకపోతున్నారు . టమోటా, బొప్పాయి ఇతర కూరగాయలు మార్కెట్‌కు తీసుకెళ్లలేకపోతున్నాం. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి సాహసం చేయలేకపోతున్నారు.

- వినోద్ కుమార్, పెద్దఉప్పరపల్లె

మురుగు తొలగుతోంది!




కుప్పం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘానికి పట్టిన మురుగు తొలగుతోంది. పురపాలక సంఘం పరిధిలోని ప్రధాన మురుగు కాలువలను పరిశుభ్రం చేసే పనికి మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు గురువారం శ్రీకారం చుట్టారు. మొదటిసారి సుమారు నెలా రెండు నెలల క్రితం కాలువలు శుభ్రం చేశారు. మళ్లీ మురుగు పేరుకు పోవడంతో ఇప్పుడు రెండోసారి అదే పనికి దిగారు. రెండు రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధాన కాలువలపై బండలు తొలగించి, పారిశుధ్య సిబ్బందితో మురుగ కాలువల్లోని పూడిక తీయిస్తున్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి డంపింగ్ యార్డుకు తరలించే పరిశుభ్రతా కార్యక్రమం సైతం నిర్విరామంగా జరుగుతోంది. వెడల్పు అయిన ప్రధాన కాలువలను ఎన్నాళ్లుగానో పిచ్చి పొదలు ఆక్రమించాయి. ఈ పొదల తొలగింపు కార్యక్రమం సైతం నిర్విరామంగా జరుగుతోంది. కాలువ గట్లపై ఉన్న పిచ్చి పొదలను తొలగించి తర్వాత పూడికతీత పనులు చేస్తున్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

రామకుప్పం: శాంతిపురం ఐసీడీఎస్ సీడీపీవో కల్పన ఆధ్వర్యంలో శుక్రవారం రామకుప్పంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.





ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి


రొంపిచెర్ల: బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈవో శ్రీనివాసులు


పలమనేరులో బహుమతులు అందజేస్తున్న ఎంఈవో లీలారాణి, సీఐ మురళీమోహన్ తదితరులు

రొంపిచెర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని ఎంపీడీవో రెడ్డెప్పఆచారి, ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం రొంపిచెర్ల జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో జరిగిన వివిధ ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూబాల్యవివాహాలు నిర్మూలించాలని, బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098కు సమాచారం అందించాలని కోరారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, హెచ్ఎం కృష్ణవేణి, సుధారాణి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** బాలికలు చదువుతో పాటు క్రమశిక్షణ అలవరచుకోవాలని పలమనేరు సీఐ మురళీమోహన్ సూచించారు. శుక్రవారం పలమనేరు బాలికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో లీలారాణి, ఎంపీడీవో భాస్కర్, సీడీపీవో ఇందిరా ప్రియదర్శిని, సీఐ మురళీ మోహన్, సూపర్‌వైజర్లు , అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.





ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా ఆయుధపూజ


ఆయుధ పూజల్లో పాల్గొన్న నేతలు, అధికారులు

సోమల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సోమల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆయుధపూజ శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఏఈ మహేంద్రరెడ్డి, ఎల్ఐ చిన్నరెడ్డెప్పరెడ్డి, లైన్‌మెన్లు, జేఎల్ఎంలు , ఆవులపల్లె, నంజంపేట, కందూరు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● **రామకుప్పం:** రామకుప్పం మండల పరిషత్తు, రెవెన్యూ కార్యాలయాల్లో శుక్రవారం ఆయుధ పూజలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు కార్యాలయాల్లో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అధికారులు, సిబ్బంది, నేతలకు ఈ సందర్భంగా తాంబూలాలు, మిఠాయిలు అందజేశారు. తహసీల్దారు కౌలేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, ఏఎంసీ మాజీ చైర్మన్ సీతాపతి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్ విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ,నాయకులు పాల్గొన్నారు.



43 పంచాయతీలకు నిధుల గండం!

నిలిచిపోయిన రూ.6 కోట్లు - ఎన్నికలు జరక్కపోవడంతో ఆపేసిన కేంద్ర ప్రభుత్వం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను ప్రభుత్వం గత బుధవారం పంచాయతీల బ్యాంకు ఖాతాలకు జమచేసింది. అయితే ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 43 పంచాయతీలకు ఆ నిధులు జమకాలేదు. గత ఐదేళ్ల కాలంలో ఎన్నికలు జరగకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిధులను నిలిపివేసింది. ఈ పంచాయతీలకు రెండు విడతల్లో సైతం ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. దీంతో ఒక్కో పంచాయతీ రూ.లక్షల్లో నిధులను కోల్పోయింది. ఫలితంగా ప్రగతి మాట ఎలావున్నా... కనీసం పారిశుధ్యపనులు నిర్వహించలేని దుస్థితి ఆయా పంచాయతీల్లో నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎన్నికలు జరగని పంచాయతీలు రెండు విడతల్లో దాదాపు రూ.6 కోట్ల వరకు నిధులను కోల్పోయాయి.

జనాభా ప్రాతిపదికన ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు విడుదల చేస్తుంది. పాలకవర్గాలుంటేనే నిధులు విడుదల చేయాలన్న నిబంధన విధించింది. ఆర్థిక సంఘం నిధులను తాగునీటి సరఫరాకు, పారిశుధ్య పనులకు ఎక్కువశాతం కేటాయిస్తారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు పంచాయతీల విలీనాల ప్రక్రియపై అభ్యంతరాలు వచ్చినా లెక్కపెట్టలేదు. ఈ కారణంగా అనేక మంది కోర్టులను ఆశ్రయించడంతో, ఎన్నికలు జరగలేదు. దీంతో ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి.

ఎన్నికల్లేని పంచాయతీలివే!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1411 గ్రామ పంచాయతీలుండగా, వివాదాలు, విలీనాల కారణంగా 2021 ఫిబ్రవరి 9 నుంచి నాలుగు విడతల్లో జరిగిన ఎన్నికల ప్రక్రియలో 43 పంచాయతీలు పాల్గొనలేదు.నగరి మండలంలో నాంబాకం, డి. అగరం, కృష్ణరామాపురం, పెనుమూరు మండలంలో కలిగిరి, మొరవకండ్రిగ, పెనుమూరు, రామచంద్రాపురం మండలంలో దేసూరి కండ్రిగ, కుప్పంబాదూరు, నేతకుప్పం, సొరకాయల పాళెం, వడమాలపేట మండలంలో బలినాయుడుకండ్రిగ, బంగారెడ్డికండ్రిగ, కాయం, టి.సి. అగ్రహారం, బి.కొత్తకోట మండలంలో బి.కొత్తకోట పంచాయతీలకు ఎన్నికలు జరుగలేదు. కుప్పం మండలంలో మల్లానూరు, మోట్లచేను, టి. సదుమూరు, రామకుప్పం మండలంలో ననియాల తాండా, రొంపిచెర్ల మండలంలో బొమ్మాయిగారిపల్లి, చెల్లావారిపల్లి, చంద్రగిరి మండలంలో కల్రోడ్‌పల్లి, పనపాకం, కేవీబీ పురం మండలంలో ఎలమాన్యం కండ్రిగ (కాళంగి), కళత్తూరు, కళత్తూరు-2, కందులూరు, స్వర్ణలింగేశ్వరపురం, పాకాల మండలంలో ఆదెనపల్లి, కొత్తవడ్డేపల్లి, పెద్దబైనపల్లి, పులిచెర్ల మండలంలో ఎల్లంకివారిపల్లి, శ్రీకాళహస్తి మండలంలో పాపనపల్లి, చల్లపాళెం, గోవిందరావు పల్లి, కలవగుంట, మన్నవరం, పోలి, వేలంపాడు, యర్లపుడి, రేపల్లె, వైఎస్సార్ బీసీ కాలనీ, వాంపల్లె పంచాయతీల్లో ఎన్నికలు ఆగిపోయాయి.ఇవన్నీ అధికారుల ఏలుబడిలోనే కొనసాగుతున్నాయి. గత ఏడాది అక్టోబరులో 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు జమయ్యాయి. రెండో విడత నిధులు



గత బుధవారం విడుదలయ్యాయి. ఈ రెండు విడతల్లో ఆయా పంచాయతీల్లో జనాభా ప్రాతిపదికన సుమారు రూ.6 కోట్ల ఆర్థిక సంఘం నిధులు కోల్పోయినట్లు అధికారులు అంచనా వేశారు. ఈ నిధులు సమకూరివుంటే ఆయా పంచాయతీల్లో చాలావరకు రహదారులు, కాలువలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉండేది. ఎన్నికలు నిర్వహించకపోవడం పంచాయతీల ఆర్థిక అవకాశాలను దెబ్బతీసింది.

పీహెచ్‌సీ వైద్యాధికారులకు టైమ్ బౌండ్ ప్రమోషన్లు కల్పించాలి

డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట వైద్యాధికారుల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యాధికారులకు టైమ్ బౌండ్ ప్రమోషన్లు కల్పించాలని ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యుల సమస్యల పరిష్కరించాలని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో 30 శాతం ఉన్న ఇన్ సర్వీస్ పీజీ కోటాను ఇప్పుడు జీవో 99 ద్వారా 15శాతం తగ్గించారన్నారు. అది కూడా 6 విభాగాలకు మాత్రమే పరిమితం చేయడం దారుణమన్నారు. కేరళలో 50 శాతం, కర్ణాటకలో 40 శాతం, తమిళనాడులో 30 శాతం ఇన్‌సర్వీస్ కోటా పీజీ సీట్లు మంజూరు చేస్తున్నప్పుడు ఏపీలో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

ఓటర్ల జాబితాపై రాజకీయపార్టీలతో నేడు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సమావేశం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా విషయంగా వివిధ రాజకీయ పార్టీల నేతలతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ అధ్యక్షతన శనివారం ఉదయం 10 గంటలకు గంగాధరనెల్లూరు తహసీల్దార్ ఆఫీసులో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల డీటీ మహేశ్వరి తెలిపారు. ఈసమావేశానికి ఆయా మండలాల అధికారులు, రాజకీయపార్టీల నేతలు హాజరుకావాలని కోరారు.

డీఎస్పీకీ తప్పని కుల వివక్ష

దళిత సంక్షేమ సంఘం ఆందోళన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

చిత్తూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీ స్థాయి అధికారికి కూడా కుల వివక్ష తప్పలేదని దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ చెప్పారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. కార్వేటినగరం కత్తిరిపల్లెకు చెందిన జనార్దనరావు విజయవాడ ట్రాఫిక్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆయన తన సొంత గ్రామంలో భూమిని కొనుగోలు చేశారని చెప్పారు. అయితే ఆయన కొన్న భూమిలోకి అగ్రవర్ణాలవారు వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ సంఘటనపై నగరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా అతనిపైనే కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పడం బాధా కరమన్నారు. పోలీసు అధికారులకే న్యాయం జరగకపోతే, సామాన్యులకు ఎలా న్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కల్తీ మద్యానికి చెక్ పెట్టేందుకే 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్

● డీసీ విజయ్‌శేఖర్



ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్ గురించి వివరిస్తున్న డీసీ విజయ్‌శేఖర్

చిత్తూరు సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం 'ఏపీ ఎక్సైజ్ సురక్ష' యాప్ తీసుకువచ్చిందని ఎక్సైజ్ డీసీ విజయ్‌శేఖర్ చెప్పారు. శుక్రవారం చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ మద్యం నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. అందులో భాగంగానే ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ తీసుకువచ్చిందన్నారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఎవరైనా మద్యం వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మద్యం ఎక్కడ తయారు చేశారు? పరిమాణం ఎంత ? ధర ఎంత ? కంపెనీ పేరు? ఏ మద్యం దుకాణంలో విక్రయించారు? అనే వివరాలు తెలుసుకోవచ్చాని చెప్పారు. మద్యం దుకాణదారులు కూడా ప్రతి మద్యం బాటిల్‌ను స్కాన్ చేసి విక్రయించాలని చెప్పారు. బెల్ట్ షాపుల నిర్మూలన దిశగా ఎక్సైజ్ అధికారులు అన్ని చర్యలూ చేపట్టారని చెప్పారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం దుకాణాల్లో నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు రుజువైతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా కల్తీ మద్యం విక్రయించినట్లు, బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు, సారా తయారు చేస్తున్నట్లు, డ్రగ్స్, గంజాయి తదితర నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే 14405 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీఐ శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూరేడువారిపల్లిలో ఒంటరి ఏనుగు హల్‌చల్

కల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు-సదుం రోడ్డులోని సినిమా థియేటర్ సమీపంలో గురువారం రాత్రి సుమారు 8 గంటల సమ యంలో ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. రోడ్డుపై వెళుతున్న వాహనచోదకులు రోడ్డు పక్కనున్న ఒంటరి ఏనుగును చూసి భయ భ్రాంతులకు గురయ్యారు. పశ్చిమ విభాగం అడవిలోని పెద్దవంక నుంచి గురువారం రాత్రి బయలుదేరిన ఒంటరి ఏనుగు కల్లూరు-గంటవారిపల్లి రోడ్డును దాటుకొని పాతపాళ్యం అటవీ మార్గంలో కల్లూరు సినిమా థియేటర్ వద్దకు చేరుకుంది. ఒంటరి ఏనుగు జాడను గమనించిన ఫారెస్ట్ సిబ్బంది టపాకాయలు పేల్చడంతో ఒంటరి ఏనుగు రోడ్డు పక్కన కొంత సమయం నిలబడిపోయింది. ఇదే సమయంలో కల్లూరు నుంచి పాతపేటకు చెందిన ప్రేమ్‌కుమార్ తన భార్యతో ద్విచక్రవాహనంపై ఈ మార్గంలో వెళుతూ రోడ్డు పక్కనున్న ఏనుగును ఒక్కసారిగా చూడటంతో భయభ్రాంతులకు గురయ్యాడు. రోడ్డుపై వెళుతున్న మరికొందరు వాహనచోదకులు సైతం ఒంటరి ఏనుగును చూసి భయపడ్డారు. సుమారు అరగంట సేపు అక్కడే ఉన్న ఒంటరి ఏనుగు ఘీంకారాలు చేయడంతో ప్రజలు ఆందోళన చెందారు. కొంత సేపటికి ఒంటరి ఏనుగు కల్లూరు-సదుం రోడ్డును దాటుకొని మంగళంపేటకు చెందిన రామకృష్ణయ్య మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. అక్కడి నుంచి పూరేడువాండ్లపల్లి వద్దకు చేరుకున్న ఒంటరి ఏనుగు రైతులు ప్రభాకర్, మునస్వామి, శంకర్, రెడ్డెప్పకు చెందిన కొబ్బరి, మామిడి, అరటి చెట్లను ధ్వంసం చేసింది. పశుగ్రాసాన్ని తినేసిన ఒంటరి ఏనుగు వచ్చిన మార్గంలోనే అడవిలోకి చేరుకుంది. శుక్రవారం పగలంతా అడవిలోని పెద్దవంక సమీపంలో ఒంటరి ఏనుగు సంచరించినట్లు ప్రజలు తెలిపారు.

కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలు ప్రారంభం



తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు - స్వామి అమ్మవార్ల ఉత్సవర్ల ఊరేగింపు

చంద్రగిరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేసి, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అన్నప్రానాయనం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం చేశారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ల, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించి, పవిత్ర ప్రతిష్ఠ చేశారు. పవిత్రోత్సవాల కారణంగా శుక్రవారం నుంచి ఆదివారం వరకు కల్యాణోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది. గృహస్థులు(ఇద్దరు) రూ.500 చెల్లించి పవిత్రోత్సవాల ఆర్జిత సేవలో పాల్గొనవచ్చు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, అర్జితం ఇన్‌స్పెక్టర్ అనంబట్టు ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచర్యులు, శేషాచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదార్ చిరంజీవి పాల్గొన్నారు.

సీనియర్ల మంచి సలహాలను అనుసరించండి

● సన్మాన సభలో విశ్రాంత సీఎండీ సంతోషరావు



తిరుపతి (ఆటో నగర్), అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ఏ సంస్థలోనైనా సీనియర్ల మంచి సలహాలను అనుసరించినప్పుడు మంచి ఫలితాలు వస్తాయని సదరన్ డిస్కం విశ్రాంత సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. రేణిగుంట మండలం తూకివాకం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులకు, రైతులకు, పారిశ్రామిక వేత్తలకు ఉత్తమ సేవలందించామని చెప్పారు. అధికారుల నిర్ణయాలు క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా పర్యవేక్షించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని విశ్రాంత సీఎండీలు కలాల రంగనాథం, పి.గోపాల్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా విశ్రాంత సీఎండీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, రామమోహన రావు, సీజీఎంలు శోభావాలంటీన, రమణాదేవి, ఉమాపతి, ఆదిశేషయ్య, జానకిరాం, జీఎం ఎం.కృష్ణారెడ్డి, ఎస్‌ఈలు ఎస్.రమణ, వి.చంద్రశేఖర్‌రావు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి విరాళంగా కొప్పెర గంగాళం



తిరుమల/తిరుపతి రూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి శుక్రవారం కొప్పెర(హుండీ) గంగాళం విరాళంగా అందింది. తిరుపతి సమీపంలోని కొప్పెరవాండ్లపల్లెకు చెందిన కొప్పర సాయిసురేష్ ఈ హుండీ గంగాళాన్ని ఆలయ పోటు పేష్కార్ మునిరత్నంకు అందజేశారు. రాగి, ఇత్తడి కలిపి తయారు చేసిన ఈ హుండీ బరువు 70 కిలోలు ఉంటుందని, దీని విలువ రూ.2.50 లక్షలని దాత తెలిపారు. తాము 1821 నుంచి వంశపారంపర్యంగా స్వామికి కొప్పెర గంగాళాలను సమర్పిస్తున్నామని వివరించారు. అంతకుముందు కొప్పరవాండ్లపల్లెలోని వినాయకస్వామి ఆలయంలో కొప్పెర వంశస్థులు ఈ గంగాళానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 8వ తరానికి చెందిన సాయిసురేష్ కుటుంబీకులు ఈ గంగాళాన్ని తిరుమలకు తీసుకెళ్లారు.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రేణిగుంట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఇక్కడి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో చిత్తూరు డీఐజీ, తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. నిషేధిత జాబితాలోని భూములను కోర్టు ద్వారా తెచ్చుకున్న ఆర్డర్లను దొడ్డిదారిలో చూపి రిజిస్ట్రేషన్లు చేసినట్లుగా గుర్తించినట్లు తెలిసింది. అలాగే రిజిస్ట్రేషన్ నెంబర్లు పెండింగ్ ఉన్నట్లు సమాచారం. తిరుపతి రూరల్‌లోని దేవదాయ శాఖకు సంబంధించిన నిషేధిత జాబితాలోని సర్వే నెం.242లో నిర్మించిన డూప్లెక్స్ విల్లాలు, భవంతులకు రిజిస్ట్రేషన్లు చేసినట్లు గుర్తించినట్లు చెబుతున్నారు. పలు రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వాదాయానికి గండి పడడాన్ని తనిఖీల్లో గుర్తించినట్లు తెలిసింది. కాగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి సెలవుపై విజయవాడకు వెళ్లడం గమనార్హం. ఈ తనిఖీల వివరాలను వెల్లడించడానికి అధికారులు నిరాకరించారు.

దర్శనానికి వెళ్లి.. మా ఆయన తిరిగి రాలేదు!

రెండున్నర నెలల తర్వాత తిరుమల పోలీసులను ఆశ్రయించిన కాకినాడ జిల్లా వాసి




శ్రీనివాస్ (ఫైల్ ఫొటో)

తిరుమల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీనివాసుడి దర్శనానికి వెళ్లిన మా ఆయన తిరిగి రాలేదు. ఆచూకీ తెలిస్తే చెప్పండి' అంటూ కాకినాడ జిల్లాలోని తాళ్లరేవు మండలం నీలపల్లి గ్రామానికి చెందిన పల్లా శ్రీదేవి కోరుతున్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త పల్లా శ్రీనివాస్(32), కొడుకుతో కలిసి ఆగస్టు 2న తిరుమలకు చేరుకున్నట్లు చెప్పారు. ఆలయంలోకి తాను రాకూడదని శ్రీదేవి చెప్పడంతో కుమారుడిని భార్యకు జత చేసి, పీఏసీ1 వద్దనున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం దగ్గరే కూర్చోమని చెప్పి పల్లా శ్రీనివాస్ దర్శనానికి వెళ్లారు. ఆ తర్వాత ఎంతకీ ఆయన తిరిగి రాలేదు. ఇద్దరి దగ్గరా సెల్ ఫోన్లు లేవు. తాము కనిపించలేదని సొంతూరికి వెళ్లిపోయి ఉంటాడని ఆమె బిడ్డతో కలిసి తమ గ్రామానికి చేరుకున్నారు. భర్త ఆచూకీ లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో విచారించాక శుక్రవారం తిరుమలకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పల్లా శ్రీనివాస్ ఆచూకీ తెలిసిన వాళ్లు 94407 96772, 0877 2289031 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

ఉరకలెత్తిన ఉత్సాహం

● ఎస్వీయూలో సాంస్కృతిక ప్రదర్శనల హోరు

● నేటితో ముగియనున్న యువతరంగ్





పాడుతా.. తీయగా



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రెండో రోజైన శుక్రవారం యువతరంగ్- 2025 కార్యక్రమం వైభవంగా సాగింది. సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు తమ కళా ప్రదర్శనలతో హుషారెత్తించారు. ఇండియన్ గ్రూప్ సాంగ్, వెస్ట్రన్ గ్రూప్ సాంగ్, వెస్ట్రన్ సోలో ఇన్‌స్ట్రుమెంటల్, ఇండియన్ క్లాసికల్ డాన్స్, ఫోక్ డాన్స్, ట్రైబల్ డాన్స్‌తోపాటు వక్తృత్వం, చర్చాగోష్ఠి, స్పాట్ పెయింటింగ్, కార్టునింగ్ వంటి పోటీలు నిర్వహించారు. భారీ సంఖ్యలో హాజరైన స్థానిక విద్యార్థులతో వర్సిటీలో సందడి నెలకొంది. ఆయా కార్యక్రమాల్లో స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్, కల్చర్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ రంజిత్ కుమార్, స్వరూప్, డాక్టర్ ఉదయ్, రాజశేఖర్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో నేడు: మిమిక్రీ, మైమ్, స్కిట్, ఏకాంకిక, ఫోక్ ఆర్కెస్ట్రా, క్రియేటివ్ కొరియోగ్రఫీ, క్విజ్, క్లే మోడలింగ్, రంగోళీ వంటి పోటీలను శనివారం నిర్వహిస్తారు. కాగా, శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కరరావు హాజరు కానున్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.



యువత ఉత్సాహం

ఎస్వీయూకు నేడు సాధారణ పని వేళలు

ప్రతి మూడో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎస్వీయూలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తుంటారు. యువతరంగ్ సందర్భంగా సాధారణ పని వేళలు (ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు) ఉంటాయని రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.





సుబ్రహ్మణ్య స్వామికి కావళ్ల మొక్కు - జాతరమ్మో జాతర







పంచెకట్టు అదుర్స్

అపర భగీరథుడు.. చంద్రబాబు

● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



దండికుప్పం చెరువులో జలహారతి ఇస్తున్న కంచర్ల శ్రీకాంత్

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ సాగు, తాగునీటి కష్టాల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా అపరభగీరథుడిగా హంద్రీ-నీవా కెనాల్ తో కృష్ణాజలాలను తీసుకొచ్చిన సీఎం చంద్రబాబును నియోజకవర్గ రైతులు ఆయన్ను ఆరాధ్యదైవంగా కొలుస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. కృష్ణాజలాలతో నిండి మొరవ పోతున్న శాంతిపురం మండలం దండికుప్పం చెరువులో శుక్రవారం నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పీకేఎం ఉడా చైర్మన్ డా.సురేష్‌బాబులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా జలాలతో ఒక్కో చెరువు నిండుతుంటే రైతులు పులకరించిపోతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నందిగం ఉదయ్‌కుమార్, మంజునాథ్, క్లస్టర్ ఇన్‌చార్జీలు నాగరాజు, రాజేంద్ర, యూనిట్ ఇన్‌చార్జీలు ఆర్‌ఎస్‌మణి, లోకేష్, మునిరెడ్డి, రెస్కో డైరెక్టరు అనసూయ, ఏఎంసీ డైరెక్టర్లు శ్యామల, హరినాథరెడ్డి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధితోనే అసలైన రాష్ట్రాభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే అసలైన రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు అన్నారు. గ్రామ పంచాయతీ వర్గీకరణ, సిబ్బందికి పదోన్నతులు కల్పించిన నేపథ్యంలో కుప్పంలోని మండల సచివాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి, గ్రామస్తుల జీవనం మెరుగు పడడానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఉద్యోగులు సంతృప్తిగా ఉంటేనే ఆయా పథకాలు సక్రమంగా అమలవుతాయన్న వాస్తవాన్ని గుర్తించి పదోన్నతులు కల్పించారని చెప్పారు. సిబ్బంది సైతం చిత్తశుద్ధితో పనిచేసి గ్రామీణులకు విలువైన సేవలు అందించాలని కోరారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు మాట్లాడుతూ పదోన్నతులు కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేశ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి నరేశ్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు



చారాలలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



అండర్-17 జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

చౌడేపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ క్రీడల్లో భాగంగా అండర్-14, అండర్-17 బాల బాలికల కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. శుక్రవారం మండలంలోని చారాల హైస్కూల్‌లో జరిగిన కబడ్డీ పోటీలను టీడీపీ మండలాధ్యక్షులు రమేష్‌రెడ్డి ప్రారంభించారు. పోటీలలో పలమనేరు డివిజన్ పరిధిలోని 10 మండలాల నుంచి 44 జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలలో అండర్-17 బాలికల విభాగంలో చౌడేపల్లె హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా, వి.కోట మండలం విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. అలాగే అండర్-17 బాలుర విభాగంలో సదుం మండం విద్యార్థులు విజేతలుగా, చౌడేపల్లె మండలం రన్నర్స్‌గా నిలిచారు. అలాగే అండర్-14 బాలికల విభాగంలో పలమనేరు విన్నర్స్‌గాను, గంగవరం రన్నర్స్‌గాను నిలిచారు. అండర్-14 బాలుర విభాగంలో పలమనేరు విజేతలుగాను, వికోట మండలం విద్యార్థులు రన్నర్స్‌గాను నిలిచారు. అండర్-17 బాలుర విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పలమనేరు డివిజన్ జట్టుకు 16 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం రేణుకా పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబునాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, కోర్డినేటర్ శశి, వెంకటేష్, పీడీ రాజేంద్ర, విశ్రాంత పీడీ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

కుప్పం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. రైల్వే పోలీసులు చెప్పిన వివరాల మేరకు కుప్పంలోని డీకేపల్లె రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో వీక్లీ స్పెషల్ రైలు ఢీకొని ఒక మహిళకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. గుర్తు తెలియని ఆ మహిళ వయసు సుమారు 60-65 సంవత్సరాలు ఉంటుంది. ఆమెను గుర్తుపట్టిన వారు ఫోన్‌నంబర్లు 9000716436, 8074088806 లను సంప్రదించి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం పుంగనూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు... పట్టణంలోని మేలుపట్లకు చెందిన శివశంకర్ భార్య కృష్ణవేణి (25) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. భర్త శివశంకర్ బెంగళూరులోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. అయితే గురవారం రాత్రి భార్య, భర్తలు ఫోన్‌లో ఘర్షణ పడి ఇంట్లో ఉన్న చీమల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గుర్తించి స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

కుటుంబ కలహాలతో మరో వ్యక్తి..

పుంగనూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని బండ్లపల్లెకు చెందిన నారాయణరెడ్డి కుమారుడు కృష్ణారెడ్డి(50) వ్యవసాయ పనులు చేస్తున్నట్లు తెలిపారు. భార్య, భర్తల మధ్య చిన్న మనస్పర్థలు రావడంతో కృష్ణారెడ్డి ఇంటి వద్దనే ఉరేసుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు కృష్ణారెడ్డిని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉందని సూచించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీవో లీలామాధవి

చౌడేపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లీలామాధవి మాట్లాడుతూ బాలికలు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివితేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని.. తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో రాజేశ్వరి, సూపర్‌వైజర్లు సులోచన, రాధమ్మ, ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో రాజేశ్వరి

● **పుంగనూరు రూరల్:** బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవసరమని.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పుంగనూరు సీడీపీవో రాజేశ్వరి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక బసవరాజ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, విద్య ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం తదితర అంశాలపై వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాస రచన, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో నటరాజరెడ్డి, ఎస్‌ఐ వెంకటరమణ, సూపర్‌వైజర్లు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయానికి ప్రింటర్ వితరణ

కల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు శుక్రవారం ఎంఈవో కార్యాలయానికి రూ.13 వేలు విలువైన ప్రింటర్‌ను వితరణగా అందజేసినట్లు ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మండలం నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు ప్రింటర్ వితరణగా అందజేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు తులసీరాం, కళావతమ్మ, రఫి, ఆనందయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శకద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"'తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజీను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

ఏపీటీఎఫ్ యాదమరి అధ్యక్షుడిగా దేవానంద్



యాదమరి, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) యాదమరి మండల నూతన కమిటీ ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. మండల అధ్యక్షుడిగా రేగంటి దేవానంద్, ప్రధాన కార్యదర్శిగా త్యాగరాజు రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదనపు కార్యదర్శిగా హేమలత, సహాధ్యక్షురాలిగా కళైవాణి ఎన్ని కయ్యారు. రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగల్రాయ మందడి ఆధ్వర్యంలో కొటాల ఉన్నత పాఠశాలలో ఈ సమావేశం నిర్వహించారు.

శబరిమలైకి బయలుదేరిన పూతలపట్టు ఎమ్మెల్యే



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ శుక్రవారం కాణిపాక క్షేత్రంలో కొలు వైన మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప దీక్షకు ఇరుముడి కట్టి శబరి మలకు బయలుదేరారు. ఈవో పెంచలకిషోర్, ఆలయ చైర్మన్ మణినాయుడు, ఏఈవో రవీంద్రబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు హరిబాబునాయుడు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ దేవదాస్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని శుక్రవారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దేవదాస్, విజయనగరం జిల్లా చీపురుపల్లె ఎమ్మెల్యే కళావెంకట్రావు దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో రవీంద్రబాబు, ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు పాల్గొన్నారు.

సమస్యలను ఆలకించి..

అక్కడికక్కడే పరిష్కరించి

- శ్రీలంక కాలనీలో ఎమ్మెల్యే గురజాల పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

చిత్తూరు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సమస్యలను ఆలకించడమే కాకుండా.. అక్కడికక్కడే పరిష్కరించారు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్. శుక్రవారం నగరపాలక సంస్థ 15వ డివిజన్ పరిధిలోని శ్రీలంక కాలనీలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పర్యటించారు. గ్రామానికి మధ్యలో ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు రావడంతో ఆ నీళ్లంతా ఇళ్లమధ్యలోనే నిలిచిపోతుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వర్షపునీరు వెళ్లడానికి అవసరమైన కాలువను తవ్వడానికి భూమి యజమానితో అక్కడికక్కడే మాట్లాడి ఒప్పించారు. కాలువ తీయడానికి భూ యజమాని దగ్గరే అప్పటికప్పుడే భూమి పూజ చేయించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. చాలా ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, స్థలాన్ని కేటాయిస్తే శ్రీలంక, బర్మా ట్రస్టు ద్వారా నిధులు మంజూరు అవుతాయని చెప్పారు. దాంతో ఎమ్మెల్యే ఆర్డీవో, కమిషనర్‌తో చర్చించి అందుబాటులో ఉన్న భూములను కేటాయించాలని ఆదేశించారు. స్థానికంగా ఉన్న నివాసాలకు ప్రభుత్వ భూమిగా రికార్డులో ఉందని చెప్పగా వెంటనే లబ్ధిదారుల పేర్ల మీద మార్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ కులశేఖర్, టీడీపీ నాయకులు ఈశ్వరరావు, నీరజాక్షులనాయుడు, వెంకటేశ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

21న పాఠశాలలకు సెలవు ప్రకటించండి : ఏపీటీఎఫ్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దీపావళి తర్వాతి రోజైన 21న మంగళవారాన్ని పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించాలని ఏపీటీఎఫ్ నాయకులు విద్యాశాఖాధికారులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ సుకుమార్‌ను కలిసిన ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు గోపీనాథ్, గౌరవాధ్యక్షుడు ముక్తార్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్, ప్రభాకర్ వినతిపత్రం అందించారు.

ఘనంగా ఏకాదశి పూజలు

విజయపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం శ్రీరామనామక్షేత్రంలో శుక్రవారం ఏకాదశి పూజలు నిర్వహించారు. సీతారాముల వారికి అభిషేకం, పూజలు నిర్వహించి తీర్థప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ పురోహితులు రామ్‌ప్రసాద్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణలో తల్లిదండ్రులదే కీలక పాత్ర



మాట్లాడుతున్న సీడీపీవో శోభారాణి

శ్రీరంగరాజపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణలో తల్లిదండ్రులదే కీలకమైన పాత్ర అని కార్వేటినగరం సీడీపీవో శోభారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బాలికా దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి రంగంలో మహిళలకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. అయితే ఇంకా చిన్నచూపు పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి షఫీషా, ఎంపీడీవో వనజ, ఎంఈవో సబర్మతి, ఆర్ఐ కళావతి, ఏపీఎం లలితా, ఏపీవో రోజా, తదితరులు పాల్గొన్నారు.





జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు

గంగమ్మగుడి పాఠశాల విద్యార్థులు



శ్రీరంగరాజపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగమ్మగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సి.ప్రియ, డి.చాందిని కె.కీర్తన, కె.కావ్య అండర్-14 వాలీబాల్ పోటీల్లో సత్తాచాటారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డివిజనల్ స్థాయిలో శుక్రవారం నగరి పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈ పోటీలు జరిగాయి. అద్భుతంగా ఆడిన అమ్మాయిలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హెచ్ఎం కళావతి, పీటీ ఉపాధ్యాయుడు లోకనాథం, ఉపాధ్యాయులు బాలాజీ, చంద్రశేఖర్, బాబు, పద్మశ్రీ, సరోజమ్మ, జానకీదేవి, సత్య, అరుణ కుమారి, ప్రసన్నకుమారి, మహేష్ వారిని అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎమ్మెల్యే భాను

నగరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం కలుగుతుందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. క్రీడా దినోత్సవం సందర్భంగా నగరి పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డివిజనల్ స్థాయి జోనల్ పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ఏడు మండలాలకు చెందిన 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. నగరి, నింద్ర, విజయపురం, కార్వేటినగరం, ఎస్ఆర్ పురం, పాలసముద్రం, వెదురు కుప్పం మండలాలకు చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరా ప్రియదర్శినిలు బహుమతులు అందజేశారు. ఈ కార్య క్రమంలో ఎంఈవోలు శ్రీదేవి, నమఃశివాయ, పాఠశాల ఉపాధ్యాయులు, టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి శ్రీనివాస్, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలాజీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మణిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నగరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలో గుండెపోటుకు గురైన బాధితులను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం పరామర్శించారు. దేశమ్మ గుడి మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి కుమారుడు మణిరెడ్డిని, మైనారిటీ నాయకుడు సలీంలను పరామర్శించారు. అనంతరం డాక్టర్ అంబ్రూస్ కుమారుడు అనారోగ్య కారణంగా మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు.





భక్తిశ్రద్ధలతో శక్తిపీఠం ప్రతిష్ఠ



నింద్ర, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగరం గ్రామ పంచాయతీలో గ్రామదేవత శక్తి పీఠం ప్రతిష్ఠించారు. బుధవారం ప్రారంభమైన వేడుకలు శుక్రవారం ముగిశాయి. ఉదయం వేద పండి తులు మధ్య శక్తి పీఠానికి ప్రత్యేక పూజలు చేసి గ్రామ నడిబొడ్డున ప్రతిష్ఠించారు. భక్తులను అన్నదానం చేశారు.

థామస్‌ను విమర్శించే అర్హత వైసీపీకి లేదు

శ్రీరంగరాజపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌ను విమర్శించే అర్హత నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మికి లేదని వెనుకబడిన కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు జయరాజ్ అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గాని, ఆయన కుమార్తె కృపాలక్ష్మి గానీ నియోజకవర్గంలో దళితుల అభివృద్ధికి ఏరోజూ కృషి చేయలేదన్నారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటచాలం, మురళి, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల అదృశ్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి ఆస్పత్రికి వెళ్లిన ముగ్గురు తిరిగి ఇంటికి రాలేదని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. దొడ్డిపల్లెకు చెందిన కదిరవేలు భార్య లోకనాయికి కుమార్తె కమలిక, కొడుకు యశ్వంత్‌లు ఈ నెల 13వ తేదీ ఇంటి నుంచి ప్రభుత్వాస్పత్రికి వెళ్లివస్తామని చెప్పి వెళ్లారు. వెళ్లిన ముగ్గురు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భర్త కదిరవేలు బంధువుల, స్నేహితుల ఇళ్లల్లో వెతికారు. వారి ఆచూకీ కనపడకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

డాబా యజమానిపై పోలీసులకు ఫిర్యాదు

బంగారుపాళెం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్ల నుంచి అక్రమంగా ఐరన్ కొనుగోలు చేస్తున్న డాబా యజమానిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చెన్నై బెంగళూరు జాతీయరహదారిలోని కేజీ సత్రం వద్ద రెడ్డి డాబా ఉంది. ఈ డాబాకు ఐరన్ కమ్మీలతో వచ్చే లారీ డ్రైవర్ల నుంచి డాబా యజమాని కమ్మి కొనుగోలు చేసి బయట విక్రయించేందుకు నిల్వ చేశాడు. ఈ విషయంలో తిరుపతిలోని కంపెనీ నిర్వాహకులకు తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు నాలుగు టన్నుల కమ్మిని స్వాధీనం చేసుకున్నారు.

నేడు భగవాన్ ధన్వంతరి జయంతి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ కులదైవం భగవాన్ ధన్వంతరి జయంతి శనివారం తిరుపతిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయి బ్రాహ్మణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విజయంలో టెక్‌స్పార్క్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయం సైన్స్ అండ్ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం టెక్‌స్పార్క్-2025 ఆర్డునో ఇన్నోవేషన్స్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు విజయం అధినేత తేజో మూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తిలు పరిశీలించారు. విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ గోపి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐరాల ఎస్సీ హాస్టల్ తనిఖీ

ఐరాల: స్థానిక ఎస్సీ హాస్టల్‌ను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి, టీసీ డీడీ రబ్బానీ బాషా తనిఖీ చేశారు. మెనూ అమలు, భోజన నాణ్యతను పరిశీలించారు. సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట వార్డెన్ సురేష్ పాల్గొన్నారు.





నిండ్ర అభివృద్ధికి సహకరించండి



నగరి ఎమ్మెల్యేని కలసిన నిండ్ర ఎంపీపీ దుర్గాదేవి

నిండ్ర, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నిండ్ర మండల అభివృద్ధికి సహకరించాలని నూతన ఎంపీపీ దుర్గాదేవి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ని కోరారు. శుక్రవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. ఆమెతో పాటు శ్రీశైలం ఆలయ మాజీ చైర్మన్ చక్రపాణిరెడ్డి, నిండ్ర పీఏసీఎస్ చైర్మన్, మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు, రైతు నాయకుడు బాబు యాదవ్, వెంకటాచలం, జనార్థన్ నాయుడు, ఓం ప్రకాష్, దేవా, రాము తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటలను క్లస్టర్ స్థాయిలో అభివృద్ధి చేయాలి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలను క్లస్టర్ స్థాయిలో అభివృద్ధి చేయాలని రీజనల్ హార్టికల్చర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అధికారి వై.విద్యశంకర్, జిల్లా ఉద్యానశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శాఖ సమావేశ మందిరంలో ఉద్యాన పంటల అభివృద్ధిపై క్లస్టర్ స్థాయి స్వచ్ఛంద సంస్థలకు, శాస్త్రవేత్తలకు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసే పంటలు, వాటి ద్వారా తయారు చేసిన ఉత్పత్తులను పెడరేషన్, కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలు, సహకార సంస్థలు భాగస్వాములై అభివృద్ధి చేయాలన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం తగిన ప్రోత్సహకాలు ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు, చిత్తూరు, తిరుపతి నుంచి ఎన్జీవోలు, ఫార్మర్ ప్రొడ్యూసర్ అధికారులు పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

గుడిపాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నరహరిపేట జడ్పీ హైస్కూలులో శుక్రవారం అండర్-17, 19 రెజ్లింగిల్ విభాగంలో జిల్లా జట్లను ఎంపిక చేశారు. అలాగే తుమ్మింద జడ్పీ హైస్కూలులో అండర్-14, 17, 19 సైక్లింగ్ విభాగంలో జిల్లా జట్ల ఎంపిక జరిగినట్లు చిత్తూరు జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య డాక్టర్ ఎస్.బాబు, బి.శారద తెలిపారు. ఎంపికైన జట్లు త్వరలో రాష్ట్రస్థాయి క్రీడ పోటీలలోపాల్గొంటాయని వివరించారు. రెజ్లింగ్ పోటీలు ఎన్టీఆర్ జిల్లా నున్నలో ఈనెల 21, 22, 23 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. నరహరిపేట జడ్పీ హైస్కూల్ పీడీ రవి, గురుప్రసాద్, న్యాయనిర్ణేతలుగా చంద్రశేఖర్‌రాజు, రేఖ, దేవరాజులు, శరత్, రవీంద్రారెడ్డి, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

జీవన ఎరువులతోనే అధిక దిగుబడి సాధ్యం

నగరి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులతోనే పంటల్లో అధిక దిగుబడి సాధ్యమవుతుందని ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయ జిల్లా ఏరువాక శాస్త్రవేత్త రామకృష్ణారావు తెలిపారు. నగరి మండలంలోని ఎం కొత్తూరులో రైతులకు జీవనరుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు రసాయన ఎరువులకు బదులు జీవన ఎరువులు వినియోగించాలన్నారు. ఏవో రాఘవేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై ముగిసిన అవగాహన కార్యక్రమం

నిండ్ర: గర్భిణులు, చిన్నపిల్లలు, యుక్తవయసు అమ్మాయిలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని నగరి ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరా ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా ఉన్నత పాఠశాలలో పౌష్టికాహారం మాసోత్సవాల్లో భాగంగా ముగింపు కార్యక్రమం నిర్వహించారు.

థామస్ అనుచిత వ్యాఖ్యలు చేశారు: కృపాలక్ష్మి

వెదురుకుప్పం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తన పట్ల ఎమ్మెల్యే థామస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జీడీనెల్లూరు వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి శుక్రవారం కార్వేటినగరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై మహిళా కమీషన్, జాతీయ ఎస్సీ ఎస్టీ కమీషన్‌కి కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

అంతర్జాతీయ బాలికా దినోత్సవం

వెదురుకుప్పం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఇతర పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఎంఈవో దామోదరం, ఉద్యోగులు హాజరయ్యారు.

● కార్వేటినగరంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజారమణి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు.

తవణంపల్లె డిప్యూటీ ఎంపీడీవోగా రాజశేఖర్



తవణంపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె డిప్యూటీ ఎంపీడీవోగా రాజశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పెద్దపంజాణి మండలం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

పాలసముద్రం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిసారించాలని, వర్షపు నీరు నిల్వ లేకుడా చూడాలని ప్రత్యేక అధికారి వెంకటరమణ పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి నీటి కాలువల్లో చెత్తాచెదారం పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. మంచి నీటి ట్యాంకుల నుంచి వెళ్లే పైపు లైన్లు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షతీష్, డిప్యూటి ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

యాదమరి, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): బెల్ట్‌షాపుల నిర్వహణ, అక్రమ మద్యం కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ టి.విజయశేఖర్ స్పష్టంచేశారు. ఆయన శుక్రవారం సూపరింటెండెంట్ శ్రీనివాస్‌తో కలిసి యాద మరి మండల కేంద్రంలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ అక్రమ మద్యం కట్టడి కోసం వినియోగిస్తున్న యాప్‌పై సిబ్బందికి, కొనుగోలుదారులకు అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐలు రమణరాజు, చరణ్ పాల్గొన్నారు.

యాదమరిలో చినుకుపడితే చిత్తడే



యాదమరిలో చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిపై నిలిచిన నీరు

యాదమరి, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): వర్షం పడితే చాలు మండల కేంద్రంలో సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేకపోవడంతో నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. కాలువలు లేకపోవడంతో చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి వర్షపు నీటితో నిండిపోయింది. శుక్రవారం కురిసిన చిన్నపాటి వర్షానికే యాదమరిలోని లోతట్టు ప్రాంతాలు, కాలనీలకు వెళ్లే దారులు జలమయమయ్యాయి. ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వర్షపు నీరు ముందుకు కదలక, మురుగు నిలిచిపోవడంతో దోమలు, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగుకాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగాల సాధనలో మహిళలే ముందున్నారు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలను పురుషులకంటే మహిళలే ఎక్కువమంది కైవసం చేసుకుంటున్నారని ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈవో ఆంజినేయులుశెట్టిలు అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవంలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు హైస్కూల్లో శుక్రవారం సమావేశం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, చైల్డ్ డీసీపీయు ఉష, సచివాలయం మహిళా పోలీస్ రత్న మాట్లాడారు. బాలికల దినోత్సవం పురష్కరించుకుని మండలంలోని 12 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో గంగాధరనెల్లూరు సర్పంచ్ సుబ్రమణ్యం, హైస్కూల్ హెచ్.ఎం. సుబ్బరామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంగీత, హైస్కూల్ టీచర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నారాయణస్వామిని, కృపాలక్ష్మిని అరెస్టు చేయాలి

మాల కార్పొరేషన్ డైరెక్టరు యుగంధర్

వెదురుకుప్పం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పంటించిన ఘటన వ్యవహారంలో మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని, ఆయన కుమార్తె కృపాలక్ష్మిని అరెస్టు చేయాలని మాల కార్పొరేషన్ డైరెక్టరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ పొన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కార్వేటినగరంలో మీడియాతో మాట్లాడారు. బొమ్మయ్యపల్లె పంచాయతీకి చెందిన అరుణ్ అనే యువకుడ్ని పోలీసు స్టేషన్‌కు తరలించి చిత్ర హింసలకు గురిచేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి అధికారులు విచారణ జరిపి బాధ్యులను సస్పెండ్ చేయాలని కోరారు. చేయని నేరంపై అమాయకుడ్ని వేధించడమే కాకుండా టీడీపీ నాయకుల పేర్లు చెప్పాలని ఒత్తిడి చేయడం గర్హనీయమన్నారు. అరుణ్‌కు న్యాయం జరిగే వరకు జనసేన పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రజా దర్బార్‌కు 28 వినతులు

చిత్తూరు సిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌కు 28 వినతులు వచ్చాయి. శుక్రవారం లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల మండలాలకు చెందిన ప్రజలు తమ వినతులను మేయర్‌కు అందించారు. మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, ఎంఈ వెంకటరామిరెడ్డి, డీఈ వెంకటరమణ, డీటీ ఇబ్రహీం పాల్గొన్నారు.

సీజేఐపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

వెదురుకుప్పం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీం న్యాయమూర్తిపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా జనరల్ సెక్రటరీ యువరాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌పై దాడిచేసిన రాకేష్‌కిషోర్‌ను అరెస్టు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్మన్న, వాసు, లోకనాథం, సర్పంచ్ వెంకటముని, తిరుమలయ్య, సతీష్, రూపేష్ భాను, వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శి మంజునాథ్, వినాయక, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం వాయిదా

గుడిపాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీడీవో శిరీష తెలిపారు. శుక్రవారం సమావేశం నిర్వహించ వలసి ఉంది. అయితే కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఆమె తెలియజేశారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

గుడిపాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని ఎంపీడీవో శిరీష, ఎంఈవో నవాజ్‌బాషా, సర్పంచ్ రజనీకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని నరహరపేట జడ్పీ హైస్కూలులో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు క్రీడలు, వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం తదితర పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుతులు, ప్రసంశా పత్రాలు అందించారు.

నేరాలు అదుపు చేయడానికే పల్లెనిద్ర

గుడిపాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో నేరాలను అదుపు చేయడానికే పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రెప్పాలమానుచేను గ్రామంలో ఆయన తన సిబ్బందితో కలసి పల్లెనిద్ర చేపట్టారు.

నేడు తోటపాళ్యం, గాంధీరోడ్లులో విద్యుత్ అంతరాయం

చిత్తూరు రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలో సంతపేట రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న సందర్భంగా చిత్తూరు అపరేషన్ డివిజన్ పరిధిలోని సంతపేట సెక్షన్‌లో 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ లైన్లు మరమ్మతు జరుగుతున్న సందర్భంగా బుధ, గురువారాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని సంతపేట డీఈ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీరోడ్డు, తోటపాళ్యం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని వివరించారు.

జూనియర్ కళాశాలలో బాలికా వారోత్సవాలు

పెనుమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బాలికా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పెనుమూరు జూనియర్ కళాశాలలో బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గుడ్యాణంపల్లి, ఉగ్రాణంపల్లి, పెనుమూరు, పూనేపల్లి, శాతం బాకం, ఎల్‌కేపీఊరు ఉన్నత పాఠశాలల్లో 8,9,10 తరగతి బాలికలకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీవో నీల కంఠేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శారద, టీడీపీ మండల అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రెడ్డికళ్యాణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడ పిల్లల భద్రత మనందరి బాధ్యత

ఐరాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లల భద్రత మనందరి బాధ్యత అని ఎంఈవో రుష్యేంద్రబాబు, ఐసీడీఎస్ పీవో నిర్మల అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.పైపల్లె జడ్పీ హైస్కూలులో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. బాలికలకు ఆటల, వ్యాసరచన, చిత్ర లేఖనం, సంభాషణ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందించారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

సందేశాత్మకం



జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.



అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.